# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు.

- రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.

- ఖరీఫ్ సాగు చేసే రైతులకు విత్తనాలను సకాలంలో అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

- ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సామాజిక మాధ్యమ పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందని డిజిపి హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు.

- నైరుతి ఋతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

========================

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో మొత్తం 64.2 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకొని ప్రపంచ రికార్డు నెలకొల్పారని తెలిపారు. ఇందులో 31.2 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 85 ఏళ్లు పైబడిన వారు ఇంటి వద్దే ఓటు వేశారని వెల్లడించారు. 10 వేల కోట్ల రూపాయల విలువైన నగదుని స్వాధీనం చేసుకున్నామని, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 4.56 లక్షల ఫిర్యాదుల్లో 90 శాతం పరిష్కరించామని వివరించారు. రేపు జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియ చాలా పటిష్ఠంగా జరగనుందని రాజీవ్ కుమార్ తెలిపారు.

========================

రేపు ఉదయం 8 గంటలకు  ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. అమరావతిలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, రేపు ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్, 8 గంటల 30 నిమిషాల నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుందని తెలియజేసారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్లు ఎక్కువగా రావడంతో వీటికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి 119 మంది పరిశీలకులని ఎన్నికల సంఘం నియమించిందన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

రాష్ట్రంలో ఖరీఫ్ పంట సాగు కోసం రైతులకు విత్తనాల పంపిణీకి  కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్-2024 సబ్సిడీ, సబ్సిడీయేతర విత్తనాల సరఫరాపై వ్యవసాయశాఖ అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపధ్యంలో వారికి అవసరమైన వరి, వేరుశెనగ, ప్రత్తి తదితర విత్తనాలను సకాలంలో అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచాలని, విత్తనాల సరఫరా పరిస్థితులను వ్యవసాయశాఖ అధికారులు మండలాల వారీగా నిరంతరం పర్య వేక్షించాలని జవహర్ రెడ్డి వ్యవసాయశాఖ అధికారులకు స్పష్టం చేశారు.

========================

ఎన్నికల ఫలితాల నేపధ్యంలో సామాజిక మాధ్యమాలలో రేపు ఎవరైనా అభ్యంతకరమైన పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ ఉద్రిక్తతలు సృష్టించే వారిపై ఐ టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. పోస్టులు ఎవరి ప్రోద్బలంతో పెడుతున్నారో కూడా విచారణ చేస్తామని, రెచ్చగొట్టే పోస్టులను, ఫోటోలను, వీడియోలను వాట్సాప్ స్టేటస్ గా పెట్టుకోవడం, ఇతరులకు పంపించడం కూడా నిషేదమని తెలిపారు. గ్రూప్ అడ్మిన్ లు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమ పోస్టులపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంటుందని డిజిపి పునరుద్ఘాటించారు.

విరామం

========================

నైరుతి ఋతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల, భారీ నుంచి అతి భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో  కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపులో ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనలు, ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా ఇచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటించాలని విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. పార్లమెంటు స్థానానికి పోలైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రంలో ఈరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. బ్యాలెట్ ఓట్ల విభజన, లెక్కింపు, నివేదిక తయారీ, తదితర అంశాలపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అవగాహన కల్పించారు.

========================

న్యాయస్థానాలలో పెండింగ్ ఉన్న కేసులలో 70 నుండి 90 శాతం వరకూ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించు కోవచ్చని విశాఖ జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టుకు చెందిన మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) ఆంధ్ర ప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ సూచనలతో ఎంసీపీసీ శిక్షకులు, ఢిల్లీ ఫ్యామిలీ కోర్ట్ జడ్జి నిషా సక్సేనా, ఢిల్లీ జ్యుడిషయల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ అదితి అగర్వాల్ ద్వారా జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల కోసం 5 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎంసీపీసీ శిక్షకులు చెప్పిన మెళకువలను, కేసులలో అన్వయించి కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలనీ ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు.

========================

విశాఖపట్నం నుంచి ఈరోజు సాయంత్రం 7 గంటల 10 నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం - తిరుపతి ప్రత్యేక రైలు మూడు గంటల ఆలస్యంగా, అంటే రాత్రి 10 గంటల 10 నిమిషాలకు బయలుదేరుతుందని రైల్వే అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు చేసినట్లు తెలియజేశాయి.

========================

విద్యార్థులు త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించుకుని అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని కేంద్ర సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆకాంక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 5 రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో త్రీడి ప్రింటింగ్ రంగం ఒకటని, భవిష్యత్తు ఈ రంగానిదేనని అన్నారు.

========================

కౌంటింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లను ఈరోజు ఆయన తనిఖీ చేశారు. ఉల్లిభద్ర గ్రామంలోని ఉద్యాన కళాశాలలో జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుతో సహా అరకు లోక్ సభ నియోజక వర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కూడా రేపు జరుగుతుందన్నారు. ఈవిఎం ఓట్ల లెక్కింపుకు 8 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు ఒక కౌంటింగ్ హాల్ మొత్తం 9 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.

========================

========================